# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 138 | పేజీలు : 08 | మంగళవారం | 26-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# ప్రతి గింజా... కొనుగోలు చేస్తున్నాం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన వామపక్షాలు
- సీఎంతో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా భేటీ
- రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామన్న సీఎం
- ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగంపై వారి మధ్య చర్చ

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వామపక్షాల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర



## 13,600 కోట్ల భారీ డీల్

2

- హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..
- రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!
- ఐఆర్ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల భారీ డీల్
- 20 ఏళ్ల పాటు చెల్లింపుల వెసులుబాటు
- ప్రభుత్వానికే మెట్రో 100 శాతం వాటా
- నగరంలో మరింత పెరగనున్న మెట్రో విస్తరణ



## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై అసంతృప్తి

2

- గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి
- గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష
- రూ. 8,600 కోట్ల పనులకు డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం
- వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించాలని ఆదేశం



## పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

- కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్..
- ఎస్ఐఆర్ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్
- డూప్లికేట్ ఇట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నగరంలో 24 గంటల పాటు తాగునీరు ఇస్తామని హామీ


2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేయిస్తున్న దొంగ, డూప్లికేట్ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా

## ఇంధన ధరల పెంపు..

**ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం: నిర్మలా సీతారామన్**



2

- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్

## ఇంకా పాఠాలు నేర్చుకోలేదు

**నీట్ పేపర్ లీక్‌లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం!**

- ఎన్‌టీఏ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- కేంద్రం, సీబీఐ, ఎన్‌టీఏలకు నోటీసులు
- ఎన్‌టీఏ ప్రక్షాళన కోరుతూ పిటిషన్ల దాఖలు
- పర్యవేక్షణ కమిటీ సిఫార్సులపై కోర్టు ఆరా
- మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ పేపర్ లీక్ ఘటనలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో కోర్టు ఎన్ని ఆదేశాలు ఇచ్చినా, ఎన్ని వివాదాలు తలెత్తినా



## నారా లోకేష్ ను పదవి నుంచి తొలగించండి

2

- ప్రభుత్వం నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక మోసం చేసిన డీఎస్సీనా అని జగన్ ప్రశ్న
- డేటీ లీక్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ ద్రోహం చేశారని మండిపాటు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్

## భయపడేలా శిక్షించాలి

- అలాంటి వారిని నేరాలు చేయాలంటేనే భయపడేలా శిక్షించాలి: సీఎం విజయ్
- మహిళలు, చిన్నారులపై నేరాల్లో కఠినంగా వ్యవహరించాలన్న సీఎం విజయ్
- తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను వెంటనే నమోదు చేయాలని ఆదేశం
- దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్న సీఎం



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విషయంలో కేసులను తక్షణమే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పోలీసు



## ధరల భారం రోజురోజుకూ

- పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై స్పందించిన మల్లికార్జున ఖర్గే
- దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందన్న ఖర్గే
- రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్న
- సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి ప్రభుత్వం పెట్రోల్ జల్లుతోందని విమర్శ

2

## నీది మిషన్ మోడ్ కాదు..

**కమీషన్ మోడ్: రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు**

- ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు
- రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కల్లాల్లోనే ఉందని ఆవేదన
- రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్



2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

- తమిళనాడులో కీలక తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు
- విద్యార్థినిపై అత్యాచారం, అతి దారుణంగా హత్య అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసును

## డీల్ ఇప్పుడే లేదు

**ఇరాన్‌పై ట్రంప్ కొత్త ప్రకటన**

- ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై మాట మార్చిన డొనాల్డ్ ట్రంప్
- డీల్ ఇంకా చర్చల దశలోనే ఉందని తాజాగా వెల్లడి
- ఒప్పందం కుదిరే వరకు హర్మూజ్ జలసంధి దిగ్బంధనం కొనసాగింపు
- ఇరు దేశాల మధ్య అణు కార్యక్రమంపై ఇంకా విభేదాలు
- పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన వేలాది నౌకలు



2

## పార్టీ శ్రేణులకు
# దిశానిర్దేశం

మొదటి పేజీ తరువాయి

ఉండాలని, ఏ ఒక్క ఓటరును కోల్పోకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో తెలంగాణకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే రీతిలో నగరానికి నిరంతర మంచి నీరు అందించేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మార్కు పరిపాలనపై పూర్తి అవగాహన ఉండబట్టే, నగర ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ఓపెన్ చేస్తూ... తామే కట్టామంటూ అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, అయితే ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# ఇంధన ధరల పెంపు..

మొదటి పేజీ తరువాయి

సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు పరోక్ష కౌంటర్**

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**'3-ఎఫ్' ఫార్ములా**

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.

**భయాందోళనలు వద్దు**

ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

## నారా లోకేష్ ను పదవి నుంచి
# తొలగించండి

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించింది మెగా డీఎస్సీనా లేక నిరుద్యోగులను మోసం చేసిన దగా డీఎస్సీనా అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు. తమ హయాంలో ఇచ్చిన డీఎస్సీని రద్దు చేసి, కావాలనే ఆలస్యం చేస్తూ కొత్త నోటిఫికేషన్‌తో పబ్లిసిటీ చేసుకున్నారని విమర్శించారు. తీరా చూస్తే పేపర్లు లీక్ చేసి, డేటా డిలీట్ చేసి, మెరిట్ లిస్టులను మాయం చేస్తూ అభ్యర్థులకు పెద్ద ద్రోహం చేశారని మండిపడ్డారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను తక్షణమే మంత్రి పదవి నుంచి తొలగించాలని, ఈ లీకులపై సీబీఐ చేత విచారణ జరిపించాలని జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఒక ఎస్ సీఈఆర్టీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు ఎలా వచ్చిందో సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఆ వివరాలను డేటాబేస్ నుంచి ఎందుకు డిలీట్ చేశారో, మెరిట్ లిస్టులను ఎందుకు దాచారో, టాపర్ వివరాలను ఎందుకు తొలగించారో స్పష్టం చేయాలన్నారు. కేవలం సెలెక్ట్ అయిన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపి, కలెక్టర్ ఆఫీసుల్లో సెలక్షన్ లిస్టులు పెట్టకపోవడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు.డీఎస్సీలో 'స్పోర్ట్స్ కోటా' పోస్టులను ఒక్కొక్కటి రూ.15 లక్షలకు అధికార పార్టీ నాయకుడే ఇంటికి పిలిచి బేరసారాలు సాగించారని ఆరోపించారు. క్రీడా మైదానంలో అడుగుపెట్టని వారికి కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది రిక్రూట్‌మెంటా లేక వేలం పాటా అని ధ్వజమెత్తారు. టెట్ కన్వీనర్‌గా ఉన్న అధికారే డీఎస్సీ పరీక్షకూ కన్వీనర్‌గా ఉన్నప్పటికీ... ఉన్నపళంగా ఆయన్ను తొలగించి జాయింట్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ మెగా అవినీతిపై చంద్రబాబుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే లోకేష్‌ను పదవి నుంచి తప్పించి, సీబీఐ దర్యాప్తు కోరి ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

మొదటి పేజీ తరువాయి

విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది.విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు.ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు

# 13,600 కోట్ల భారీ డీల్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (×=ఖీజ) ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

20 ఏళ్ల పాటు ఊరట

ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది.

ప్రభుత్వానికే 100 శాతం వాటా

ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం

దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంకా పాఠాలు నేర్చుకోలేదు

మొదటి పేజీ తరువాయి

'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఇప్పటికీ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన కోర్టు.. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది.

**ఎన్‌టీఏను మార్చాలని డిమాండ్**

పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని ఫైమా, యూడీఎఫ్ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. లోపభూయిష్టంగా మారిన ఎన్‌టీఏ స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకురావాలని లేదా దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోర్టును కోరారు. నీట్ యూజీ పరీక్షలను కట్టుదిట్టంగా, స్వతంత్రంగా నిర్వహించేలా ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో డిమాండ్ చేశారు.

**మూడు రోజుల్లో అఫిడవిట్**

గత నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత పరీక్షల పర్యవేక్షణ కోసం కోర్టు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్ 14న ఏర్పాటైన ఈ మానిటరింగ్ కమిటీ చేసిన సిఫార్సులను ఎంతవరకు అమలు చేశారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఎన్‌టీఏను ఆదేశించింది. ఈ కమిటీకి నేతృత్వం వహించిన జస్టిస్ రాధాకృష్ణన్ కూడా సిఫార్సుల అమలుపై తీసుకున్న చర్యలను కోర్టుకు వివరించాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్లను మూడు రోజుల్లోగా సమర్పించాలని గడువు విధించింది.

# ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీల నేతలు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడం తప్ప కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా తాము కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మూసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది.

ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లపై ముఖ్యమంత్రి

ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీలు వారి స్వస్థలాలకు వెళ్లారని, దీంతో కొరత ఏర్పడిందని తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడంలేదని చెప్పారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి, మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని అన్నారు.మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి అన్నారు. స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో ఆయా పార్టీలు రాజకీయం చేయకూడదని కోరారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. మూసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని అన్నారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు. విద్యారంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వారికి ముఖ్యమంత్రి వివరించారు.

# డీల్ ఇప్పుడే లేదు

మొదటి పేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి చర్చలపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం దాదాపు పూర్తయిందని ఆదివారం ప్రకటించిన ఆయన, తాజాగా ఆ మాటకు భిన్నంగా మాట్లాడారు. ఒప్పందం ఇంకా చర్చల దశలోనే ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్'లో ఓ పోస్ట్ చేశారు."చర్చలు సక్రమంగానే సాగుతున్నాయి. కానీ ఒప్పందం విషయంలో తొందరపడబోము. చర్చలకు తగినంత సమయం తీసుకోవాలని మా అధికారులకు సూచించాను" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ ఓ కొలిక్కి వచ్చేంత వరకు హర్మూజ్ జలసంధిలో ఇరాన్ నౌకల దిగ్బంధనం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అణు కార్యక్రమం, యురేనియం నిల్వలు, ఆంక్షల ఎత్తివేత వంటి ప్రధాన అంశాలపై ఇరు దేశాల మధ్య ఇంకా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తోంది.ట్రంప్ తాజా ప్రకటనతో ముడి చమురు రవాణా సాధారణ స్థితికి రావడం ఇప్పట్లో సాధ్యం కాదని తేలిపోయింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి పర్షియన్ గల్ఫ్ లో దాదాపు 2,000 నౌకలు చిక్కుకుపోయాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధిని తెరిచినా, ఆ ప్రాంతంలో అమర్చిన సీమైన్స్ ను తొలగించడం, షిప్పింగ్ సంస్థలకు భద్రతపై నమ్మకం కలగడం వంటి అంశాల కారణంగా నౌకాయానం సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది.

# నీది మిషన్ మోడ్ కాదు..

మొదటి పేజీ తరువాయి

మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు.రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడం, రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు.ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు."తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ జాప్యం వల్ల వరి కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు.ధాన్యాన్ని 'మిషన్ మోడ్'లో కొంటున్నామనే సీఎం వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఇది మిషన్ మోడ్ కాదు, పూర్తిగా 'కమీషన్ మోడ్' అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. 45 రోజుల్లో రైతుబంధు నిధులు వేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి, 60 రోజులు గడిచినా వేయకుండా మాట తప్పారని, రేవంత్ రెడ్డి కేవలం ఒక "పేపర్ టైగర్" మాత్రమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి తన ఢిల్లీ ట్రిప్పులను పక్కనబెట్టి, కళ్లాల్లో ఉన్న వడ్లను తరలించడానికి లారీల ట్రిప్పులను పెంచాలని హితవు పలికారు.రాజకీయ విమర్శలు పక్కనబెట్టి రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే, స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని స్పష్టం చేశారు. అలాగే వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

# భయపడేలా శిక్షించాలి

మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర సచివాలయంలో శాంతిభద్రతలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**కేసుల నమోదులో జాప్యం వద్దు.. నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి**

ఈ సమావేశంలో సీఎం విజయ్ మాట్లాడుతూ.. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో జాప్యం జరగకూడదని అన్నారు. చట్టపరమైన చర్యలను అనుసరించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడితే, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఇతరులు భయపడతారని ఆయన అభిప్రాయపడ్డారు.మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తు సంస్థలు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం కూడా చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. సాయికుమార్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. మణివాసన్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్, డీజీపీ డాక్టర్ సందీప్ రాయ్ రాథోడ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళల భద్రతపై ప్రజా స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.

## గోదావరి పుష్కరాల
# ఏర్పాట్లపై అసంతృప్తి

మొదటి పేజీ తరువాయి

రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని అధికారులను ఆదేశించారు.సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు. "పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ధరల భారం రోజురోజుకూ

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తున్నాయి. ఈరోజు మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. దీంతో లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలు గత రెండు వారాల్లో పలుమార్లు పెరిగాయి. దీంతో ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12, లీటర్ డీజిల్ రూ.95.25గా, హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.పెట్రోల్, డీజిల్ పెరుగుదలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇంధన ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. రోజువారీ దోపిడీ వల్ల ఎవరు బాగుపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. రెండు వారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయని మండిపడ్డారు.2014లో లీటర్ పెట్రోల్ రూ.71.41గా ఉంటే ఇప్పుడు రూ.102.12కు చేరుకుందని గుర్తు చేశారు. రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదని హెచ్చరించారు. గత పన్నెండేళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ షేర్లు పెరిగినట్లు చెప్పారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం బీజేపీ నైజమని విమర్శించారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం బీజేపీ దోపిడీ భారాన్ని మోస్తోందని అన్నారు.

# గ్యాస్ సిలిండర్ ప్రజలకు అందేలా చూడాలి

**హోటళ్లకు బ్లాక్ మార్కెట్లో అక్రమంగా విక్రయిస్తున్న గ్యాస్ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి**

**గ్యాస్ సిలిండర్ వినియోగదారుల ఇళ్లకు సక్రమంగా డెలివరీ జరిగేలా చూడాలి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, నారాయణ ఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలో సాధారణ, పేద, మధ్యతరగతి ప్రజలకు అందువలన గృహ అవసరాల కోసం కేటాయించిన వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీలో తీవ్రమైన అక్రమాలు జరుగుతున్నాయని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) – సిపిఎం ఆధ్వర్యంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం, నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ మరియు కమ్యూనిస్టు లీడర్ చిరంజీవి లు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్లను వినియోగదారుల ఇంటి వద్దకే డెలివరీ చేయాల్సి ఉంది. కానీ, స్థానిక గ్యాస్ ఏజెన్సీలు, కొందరు డీలర్లు నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. సాధారణ ప్రజలకు సకాలంలో ఇళ్లకు గ్యాస్ సరఫరా చేయకుండా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. మరోవైపు, ఇళ్లకు వెళ్లాల్సిన సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను ఎక్కువ లాభాల కోసం అక్రమ మార్గంలో (బ్లాక్ మార్కెట్లో) స్థానిక హోటళ్లకు, వాణిజ్య సముదాయాలకు తరలిస్తూ బహిరంగంగానే విక్రయిస్తున్నారు. దీనివల్ల సాధారణ వినియోగదారులు సిలిండర్ కోసం వారాల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. డెలివరీ కోసం అడిగితే ఏజెన్సీల చుట్టూ తిప్పుకుంటూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున, స్పందించే గుణం ఉన్న తాము ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, గ్యాస్ బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టి, పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని సిపిఎం పార్టీ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం లేదంటే ప్రజలను ఐక్యం చేసి పోరాటలు చేస్తామని అన్నారు. సిపిఎం నాయకులు గణపతి శివరాజ్ అరుణ్ ఉన్నారు.

# ఐకేపీ మహిళల ఆవేదనకు అండగా బహుజన్ సమాజ్ పార్టీ

**హామీలు అమలు చేసి వివోఓలకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్**



**హైదరాబాద్ పల్స్, మే 25, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి ఐకేపీ వివోఓల నిరసన కార్యక్రమానికి బహుజన్ సమాజ్ పార్టీ మహబూబాబాద్ జిల్లా నాయకత్వం సంఘీభావం సోమవారం ప్రకటించింది. గ్రామీణ మహిళల శ్రమను గౌరవిస్తూ వారి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్ విజయ్ కాంత్ కోరారు. గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధి, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్న వివోఓలు అనేక ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్కువ గౌరవ వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల మహిళా సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఓల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని పేర్కొంటూ, నెలకు ముప్పై వేల రూపాయల గౌరవ వేతనం, సేవా భద్రత, పదోన్నతులు, ఆరోగ్య బీమా, డిజిటల్ సేవలకు అవసరమైన పరికరాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత గురించి చెప్పే ప్రభుత్వం ఇప్పుడు అదే మహిళల సమస్యలను ప ట్టిం చు ం కో క పో వ డ ం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందన్నారు. గ్రామీణ మహిళల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడ్ల శ్రీను, జిల్లా ఖజాంచి గుద్దేటి మనోజ్ కుమార్, డోర్నకల్ నియోజకవర్గ ఇంచార్జ్ బందెల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చి రొట్టె జిలుగు జనుము విత్తన పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, నారాయణఖేడ్** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతాంగం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచుకునేందుకు పచ్చిరొట్టె ఎరువుల సాగుపై దృష్టి సారించాలని నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఈరోజు నిజాంపేట్ మండల పరిధిలోని భాచేపల్లి గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి యస్ ) ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్టె (జిలుగు, జనుము) విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ... రాబోయే వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సాంప్రదాయ పద్ధతుల్లో పచ్చిరొట్టె ఎరువులైన జిలుగు, జనుము పంటలను సాగు చేసి, పూత దశలోనే వాటిని భూమిలో కలియదున్నడం వల్ల భూమికి అవసరమైన నత్రజని, సేంద్రీయ కర్బనం పుష్కలంగా లభిస్తాయని ఆయన వివరించారు. దీనివల్ల రసాయన ఎరువుల పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా, పంట దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని రైతులకు సూచించారు. సహకార సంఘాల (పి ఏ సి యస్ ) ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని రైతులందరూ ఈ సబ్సిడీ విత్తనాల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి యస్ ) చైర్మన్, డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు భాచేపల్లి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలాన్ని వెనక్కి తీసుకెళ్లిన కలయిక

**పెరుమాండ్ల సంకీస జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగభరితం**




**హైదరాబాద్ పల్స్, మే 25, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీస గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ఆదివారం పాత జ్ఞాపకాలతో కళకళలాడింది. 1995–96 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు దాదాపు మూడు దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై కలుసుకుని చిన్ననాటి అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన సహపాఠులు మళ్లీ పాఠశాల గడప తొక్కడంతో ఆ ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. ఉదయం నుంచే పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరుగా పాఠశాలకు చేరుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి తరగతి గదులు, ఆట స్థలాలు, బల్లలు, బ్లాక్‌బోర్డులను చూసి పాత రోజుల జ్ఞాపకాల్లో మునిగిపోయారు. చదువుకునే రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయుల క్రమశిక్షణ, పరీక్షల ఒత్తిడి, స్నేహితులతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ నవ్వులు పూయించారు. కొందరు భావోద్వేగానికి లోనై ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ కంటతడి పెట్టడం అక్కడి వారిని కదిలించింది. ఈ సందర్భంగా తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన గురువులను ప్రత్యేకంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పిచ్చిరెడ్డి, వీరయ్య, గోపిరెడ్డి, చంద్రయ్యలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా గౌరవించారు. “పల్లెటూరి ప్రభుత్వ పాఠశాలలో చదివిన మాకు జీవితంలో నిలబడే విలువలు నేర్పింది ఈ విద్యాలయమే” అని పలువురు పూర్వ విద్యార్థులు భావోద్వేగంతో పేర్కొన్నారు. గురువుల క్రమశిక్షణ, మార్గదర్శకత్వం వల్లే తాము వివిధ రంగాల్లో మంచి స్థాయికి చేరుకున్నామని కృతజ్ఞతాభావంతో తెలిపారు. సమావేశంలో పాఠశాల అభివృద్ధిపై కూడా చర్చించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు, పాఠశాలకు తమవంతు సహకారం అందించేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. పేద విద్యార్థులకు విద్యా సహాయం, స్కూల్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అభిప్రాయపడ్డారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి పాత మిత్రులందరూ కలిసి సందడి చేశారు. ఒకరోజు పాటు కొనసాగిన ఈ ఆత్మీయ సమ్మేళనం పాఠశాల రోజుల్ని మళ్లీ కళ్లముందుకు తీసుకువచ్చిందని పాల్గొన్న వారు ఆనందం వ్యక్తం చేశారు. గురు–శిష్య బంధం ఎప్పటికీ చిరస్మరణీయమని, ఇలాంటి సమావేశాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని గ్రామ పెద్దలు కొనియాడారు.




# మేడ్చల్ జిల్లాలో మొదలైన తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ

**కుత్బుల్లాపూర్, మే 25, హైదరాబాద్ పల్స్ న్యూస్ :** మేడ్చల్ మల్కాజ్గిరి లో కవిత నూతన పార్టీ (టీ.ఆర్.స్) తెలంగాణ రక్షణ సేన పార్టీ జండా పండుగ జోరుగా సాగుతుంది మొదటి జండాను ఆవిష్కరణ కండ్లకోయలో నిర్వహించారు. ఇటీవల కవిత ప్రకటించిన (టీ ఆర్ స్) పార్టీ బలోపేతానికై జండా పండుగ నిర్వహించారు. కార్యకర్తలు పార్టీ పెట్టిన కొన్నిరోజులకే ప్రతి నియోజకవర్గంలో చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి ఇంచార్జి రామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతు ఇన్ని రోజులు పార్టీ పెట్టలేదు అని అపోహలో ఉన్న కొంతమంది నాయకులు అనవసరమైన నిందలు వేశారు. మా కవిత మీద ఇప్పుడు ప్రతి ఒక్కరికి ఘాటుగా సమాధానం చెప్పే టైం వచ్చింది ఇప్పుడు మా పార్టీ లో చేరే ప్రతి ఒక్కరు నాయకుడు కవితను మీరు అన్న మాటలకు మీకు మా యువ కార్యకర్తలే సమాధానం చెప్తారు. మా పార్టీ బలాన్ని బాలగాన్ని చూడటానికి మీ కళ్ళు పెద్దవి చేసుకోండి మేము ఇకమీదట ప్రతి ఎన్నికల బరిలో ముందు ఉంటాం మా బలం ఏంటో చూపిస్తా మా ప్రత్యర్థి కలలో కూడ మా పార్టీ జండానే వచ్చే విదంగా టీ ఆర్ స్ జండా పండుగను నిర్వహిస్తాం అన్నరు. ఈ కార్యక్రమం లో నవీన్ చారీ, సీతారాం, వీరేందర్, మనోజా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లిలో ఉపాధి హామీ కార్మికులకు కూలీ కరువు

**కష్టపడి పని చేసిన వేతనం అందడం లేదు**

**పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలం వేంపల్లిలో ఉపాధి హామీ కార్మికులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. కష్టపడి పని చేసినా రోజుకు కనీస వేతనం రూ.307 కూడా అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అధికారులకు పదేపదే విజ్ఞప్తి చేసినా స్పందన లేదని, పంచాయతీ కార్యదర్శి సైతం పట్టించుకోవడం లేదని బాధితులు తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న రెండు ఫోటోల హాజరు విధానం కార్మికులకు శాపంగా మారింది. పది నిమిషాలు నిలబడినా ఫోటో నమోదు కాకపోవడంతో కూలి వస్తుందో రాదో అనే ఆందోళనలో కార్మికులు ఉన్నారు. ఈ విధానం వల్ల లక్షలాది మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ హెచ్చరించారు.రెండు ఫోటోల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కొలతలతో సంబంధం లేకుండా పూర్తి రోజు కూలి చెల్లించాలని, వేతనాలు పెంచాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బొర్కుట్ రాజేందర్, సునీత రాజన్న తదితరులు పాల్గొన్నారు

# అమృతవనం, హరిత ద్వారం ఫారెస్ట్ పార్కులను ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ



**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25 :** నియోజకవర్గంలోని బొంతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన “అమృతవనం ఎకో ఫారెస్ట్ పార్క్” మరియు మంబాపూర్ గ్రామంలోని “హరిత ద్వారం ఫారెస్ట్ పార్క్” ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ మరియు అటవీ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ ముఖ్య అతిథిగా హాజరై పార్కులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రివర్యులతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# ఆక్రమణకు గురైన పంట కాలువ రంగంలోకి దిగిన అధికారులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం తేగడ పంచాయతీ పరిధిలో గల సిక్స్ఎల్ పంట కాలువ రైతులకు సాగునీరు సరఫరా చేసే పంటకాలువలను ఆక్రమించిన ఘరానా పెద్ద మనుషులు నలుగురికి చెప్పాల్సిన వారే ఇరిగేషన్ అధికారులతో చీవాట్లు తినే పరిస్థితి తాలిపేరు పంటకాలువల ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేసిన ఇరిగేషన్ అధికారులు ఆక్రమిత భూమిలో యధావిధిగా కాలువల స్ట్రకర్లు ఏర్పాటు చేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ జేఈ సంపత్ తెలిపారు

# అసైన్డ్ భూములను అక్రమంగా అమ్మకాలు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చెయ్యాలి

**సస్పెండ్ చేయాలని సబ్ కలెక్టర్ నారాయణఖేడ్ కార్యాలయం ప్రజావాణి లో ఫిర్యాదు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, నారాయణ ఖేడ్ :** నాగలిగిద్ద మండలం ఔదత్పూరు గ్రామంలో అసైన్డ్ భూములను సెల్ డీడ్ చేసి అక్రమంగా దళారులతో కలిసి అమ్మకపు రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటూ వారిని సస్పెండ్ చేయాలని అబ్దుల్ రహీం సోమవారం నాడు నారాయణఖేడ్ సబ్ కలెక్టర్కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు సర్వే నెంబర్ 12 15లో సబ్ రిజిస్టర్, తాసిల్దార్లతో తో కొందరు కుమ్ముక్కై ప్రభుత్వ సీలింగ్ భూములను సెల్ డీడ్ అమ్మకాలు చేయడంపై ఇప్పటికి పలుమార్లు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు శూన్యమని అందుకోసం వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమాలకు పాల్పడిన అప్పటి తాసిల్దారులపై విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారం రోజుల్లో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ముందు ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'ప్రజా పాలన ప్రణాళిక' మహిళా వారోత్సవాలు

**గర్భిణులతో వంటల కార్యక్రమం, తల్లులతో ప్రతిజ్ఞ: పోషకాలపై అవగాహన కల్పించిన సిడిపిఓ రేవతి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :** బూర్గంపహాడ్ మండల పరిధిలో గల సారపాక సెక్టార్ పరిధిలోని సుందరయ్య నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 99వ రోజుల "ప్రజా పాలన ప్రణాళిక" మహిళా వారోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బూర్గంపహాడ్ సిడిపిఓ రేవతి, సెక్టార్ సూపర్‌వైజర్ సక్కుబాయి హాజరయ్యారు. మహిళా వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలతో కలిసి ప్రత్యేకంగా వంటల కార్యక్రమాన్ని (కుకింగ్ ప్రోగ్రామ్) నిర్వహించారు. గర్భధారణ సమయంలో ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో ప్రత్యక్షంగా వివరించడానికి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సిడిపిఓ రేవతి మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.దైనందిన జీవితంలో స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు మరియు పోషకాలతో కూడిన ఆహారాన్ని భాగం చేసుకోవాలని ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన తల్లులందరితో పిల్లల ఆరోగ్యం, సంరక్షణ సరైన పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సారపాక సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, ఏఎన్ఎంలు, బాలింతలు మరియు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వడదెబ్బతో ముగ్గురు మృతి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, భద్రాద్రి కొత్తగూడెం:** చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన మజ్జిరి. పెంటమ్మ (70) వడదెబ్బ కారణంగా మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, పెంటమ్మ నిన్న మధ్యాహ్నం తీవ్ర ఎండల ప్రభావానికి గురై అస్వస్థతకు లోనయ్యారు అనంతరం పరిస్థితి విషమించడంతో ఆమెను భద్రాచలం ఆసుపత్రికి తీసుకొని వెళ్లామని తీవ్ర అస్వస్థత కారణంగా భద్రాచలం వెళ్లిన ఫలితం లేకుండా మృతిచెందినట్లు తెలిపారు. ఇటీవల మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న కారణంగా వడదెబ్బతో వృద్ధులు మృతి చెందుతున్నారు. మొన్న మేడివాయి కాలనీకి చెందిన వెంకన్న, నిన్న కోరుగడ్డ పైన గుర్తు తెలియని మృతదేహం వడదెబ్బతో మృతిచెందగా నేడు కలివేరులోని పెంటమ్మ ఎండ దెబ్బకి మృతి చెందింది. వృద్ధులు, చిన్నారులు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని గ్రామస్తులు వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు.

# పిఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ బాబాసాగర్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బాబా సాగర్ గ్రామంలోనీ పి ఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న వివిధ అంశాలను పెద్దల ముందు ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయరాజు మరియు బాబాసాగర్ సర్పంచ్ సత్యమ్మ , ఉప సర్పంచ్ అజీం హుస్సేన్ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ కమల పాల్గొని విద్యార్థుల యొక్క నాట్య ,యోగా ప్రదర్శన, వివిధ పర్యావరణ సంబంధించిన నాటిక ప్రదర్శనలను తిలకించి అభినందించడం జరిగింది. సమ్మర్ క్యాంపు నందు మంచి ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది.అనంతరం సమ్మర్ క్యాంపు లో పాల్గొన్న ఇన్స్ట్రక్టర్లను గ్రామ పెద్దల చేతుల మీదుగా శాలువాలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ మరియు కుర్మదాస్, ప్రకాష్ మరియు ఇన్స్ట్రక్టర్లు వినోద్, విజయ్ కుమార్, శ్రీకాంత్, గణేష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న అదనపు ఎస్పీ**

**ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు**

**అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25,సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోయిన పక్షంలో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం మానిటరింగ్ చేస్తూ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# కాగజ్‌నగర్‌లో స్వేరో విక్టరీ డే వేడుకలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండల కేంద్రంలోని త్రిశూల్ గుట్టపై స్వేరో జిల్లా నాయకులు, సర్కిల్ విద్యార్థులు కలిసి విక్టరీ డేను ఘనంగా నిర్వహించారు. కోసిని గ్రామం నుండి స్వేరో జెండాలు చేపట్టి "జై స్వేరో" నినాదాలతో ఊరేగింపుగా గుట్టపైకి చేరుకుని వేడుకలు జరిపారు. స్వేరో నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ విద్యారంగంలో చేసిన సేవలను నాయకులు కొనియాడారు. చదువుకు నోచుకోని వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. మలావత్ పూర్ణ, ఆనంద్ కుమార్‌లకు శిక్షణ ఇచ్చి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేలా చేసిన ఘనత దక్కుతుందని వేడుకలో పాల్గొన్నవారు తెలిపారు.

# రెబ్బెన మండలంలో ధాన్యం కొనుగోలు అక్రమాలపై బీజేపీ వినతిపత్రం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారతీయ జనతా పార్టీ మండల శాఖ నాయకులు పరిశీలించారు. తార్పాళ్ళు, గోని సంచుల కొరత నెలకొందని, తూకంలో 40 కిలోల బస్తాకు అదనంగా 5 కిలోలు తీసుకుంటున్నారని గుర్తించారు. వర్షాకాలం రాకముందే ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని డిప్యూటీ ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. డిమాండ్లు నెరవేర్చకపోతే బీజేపీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కొలిపాక కిరణ్, మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి సునార్కర్ తిరుపతి, ఉపాధ్యక్షుడు మహేందర్ గౌడ్, వార్డ్ మెంబర్లు ముంజం అఖిల్, బక్క ఆనంద్, మండల కార్యదర్శి ముంజల వెంకన్న, రైతు రాజు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీఎం కార్మికుల దీక్షలకు పద్మశాలి సేవా సంఘం మద్దతు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు తమ డిమాండ్ల సాధనకై ఆరు రోజులుగా మిల్లు గేటు ముందు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఆరవ రోజైన సోమవారం కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలో కూర్చున్న గోలెం వెంకటేశం, ఏకే సింగ్, రాజేష్ యాదవ్, నరేందర్ గౌడ్, రాములు, శ్రీనివాస్, సి. వెంకటేష్, పొన్న రమేష్‌లకు పూలమాలలు వేసి సంపూర్ణ మద్దతు తెలిపారు.మిల్లు యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు, తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సంఘం డిమాండ్ చేసింది. పరిష్కారం లభించకపోతే దీక్షలకు తోడై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుల్లపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కొక్కుల మురళి, ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న, ఉపాధ్యక్షులు నూతి సుదర్శన్, కొంపెల్లి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులు వేగంగా పరిష్కరిస్తాం : కలెక్టర్ హరిత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుండి వచ్చిన పలువురు అర్జీదారుల దరఖాస్తులు స్వీకరించారు. భూ భారతి నమోదు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడి పునర్నియామకం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు, తెలంగాణ ఉద్యమ కార్యకర్తకు ఆర్థిక సహాయం, భూ సమస్య పరిష్కారం, దివ్యాంగ పెన్షన్, వృద్ధాప్య పింఛన్ వంటి వివిధ సమస్యలపై ఆసిఫాబాద్, సిర్పూర్, పెంచికలపేట, రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాలకు చెందిన పౌరులు దరఖాస్తులు సమర్పించారు.

## మహిళా వారోత్సవాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశం

### మహిళా వారోత్సవాలు మే 25 నుండి 30 వరకు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుండి 30 వరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా వారోత్సవాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. 25న గ్రామ సంఘాల భవనాల భూమి పూజ, వంట పోటీలు నిర్వహించాలని, 26న బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, 27న పోష్ చట్టంపై అవగాహన, మండల సమాఖ్యలో ప్రత్యేక సమావేశం జరపాలని తెలిపారు. 29న రుణ మేళాలు, స్వయం సహాయక సంఘాల జీవనోపాధి యూనిట్ల ప్రారంభం, 30న అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు యూనిఫాం పంపిణీ, విద్యారంభ ధ్రువపత్రాల జారీ, కిశోర బాలికలకు స్నేహ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన ఐరన్ మ్యాన్ పి. తులసిరెడ్డి కి ఘన సన్మానం

### సన్మానించిన భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి.

**కుత్బుల్లాపూర్, మే 25, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ సర్కిల్, భౌరంపేట్ గ్రామానికి చెందిన ఐరన్ మ్యాన్ పల్పునూరి తులసిరెడ్డి ప్రపంచంలోనే ఎత్తయిన మౌంట్ ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి స్వగ్రామమైన భౌరంపేట్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు మరియు కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పల్పునూరి తులసిరెడ్డి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. గ్రామానికి, ప్రాంతానికి తులసిరెడ్డి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిద్దెల యాదిరెడ్డి, పల్పునూరి పద్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి (చింటు), పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, పల్పునూరి బల్వంత్ రెడ్డి, గుర్రాల శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### ఇరవై సంవత్సరాల తర్వాత కుటుంబ సభ్యుల తో కలిసిన పూర్వ విద్యార్థులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భూర్గంపహాడ్ మండలం సారపాక లోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల లో ఇరవై సంవత్సరాల తర్వాత చదువు చెప్పిన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో కలిసి స్నేహితులంతా వాళ్ళు చదువుకున్న పాఠశాల లోనే రోజంతా ఎంజాయ్ చేస్తూ అప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. భూర్గంపహాడ్ మండలం సారపాక లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థిని, విద్యార్థులు ఇరవై సంవత్సరాల తర్వాత 2026 మే 24 ఆదివారం నాడు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల లో ఒకే చోట చేరారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో భాగంగా 20 సంవత్సరాల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి, గెట్ టూగెదర్ నిర్వహించారు. ఆనాడు విద్య బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఆనంద్, లక్ష్మీ నారాయణ, రమణ, నారాయణ, బాలాజీ, ప్రభావతి, కృష్ణ కుమారి, పద్మావతి, దూదాబాయి లను సన్మానించారు. అంతకుముందు విద్యార్థిని, విద్యార్థులు ఇప్పటి వాళ్ళ జీవనం గురించి తెలియచేస్తూ, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తరగతి గదులలో చేసిన చిలిపి చేష్టలను యాది చేసుకున్నారు. రోజంతా పిల్లా పాపలతో కలిసి గడిపారు. విద్యార్థిని విద్యార్థులు మాట్లాడిన అనంతరం వారిని ఉద్దేశిస్తూ ఉపాధ్యాయులు మాట్లాడటం జరిగింది. అందరూ కూడా మంచి హోదాలో ఉండడం, మమ్మల్ని గుర్తు పెట్టుకొని ఇలా పిలవడం చాలా సంతోషంగా ఉందని, మీరు ఇంకా మంచి మంచి శిఖరాలను అదిరోహించాలని, గురువుకి ఇంతకన్న ఆనందం ఇంకా ఏమి కావాలి అని వారు




ఆనందం వ్యక్తం చేసారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో 150 మంది కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# వంటశాల నర్మద కు నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, భద్రాద్రి జిల్లా :**
బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సారపాక కు చెందిన వంటశాల నర్మద కు రూ 8,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈమె భర్త ప్రభాకర్ స్థానిక ఐ టి సి కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. వీరికి 5 సంవత్సరములు,18 నెలల వయస్సు కలిగిన ఇద్దరూ ఆడ పిల్లలు వున్నారు. వీరి స్వస్థలం పాల్వంచ మండలం దంతెలబోరు కాగా ఉపాది కోసం సారపాక వచ్చి అద్దె ఇంట్లో నివాసం వుంటూ ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు. పేద కుటుంబం కావడం వలన ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ ప్రభాకర్ కు వచ్చే సంపాదనతోనే భార్య ,పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. కానీ విధి వారిని చిన్న చూపు చూడటంతో ఇటీవల జరిగిన ప్రమాదంలో నర్మద కు రెండు కాళ్ళు, చాతి పక్కటెముకలు విరిగి పోవడంతో మంచానికే పరిమితమైనది. ఈ విషయం నేస్తం ట్రస్ట్ దృష్టికి రావడంతో సోమవారం రోజు వారి ఇంటి వద్దకు వెళ్లి నర్మద ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్ కుటుంబ దయనీయ పరిస్థితిని చూసి కొంతమంది దాతలు ముందుకు వచ్చి అందించిన ఆర్థికంగా సహాయంతో పాటు, అతను మరికొంత అప్పు చేసి భార్య నర్మద కు వైద్యం చేయించాడు. అయినప్పటికీ ఆమె కు పూర్తిగా కోలుకోవాలంటే సుమారుగా 5 నుండి 6 నెలలు సమయం పట్టవచ్చని వైద్యులు చెప్పడంతో వైద్య ఖర్చులకు మరియు కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇద్దరూ చిన్నారుల తో సంతోషంగా ఉన్న వారి కుటుంబంలో ఒక్కసారిగా నర్మద ప్రమాదానికి గురికావడం వారిని తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. ప్రభాకర్ ఆర్థిక ఇబ్బంది, నర్మద పడుతున్నా మానసిక, శారీరక వేదన తమకు ఎంతో భాద కలిగించిందని, వారి కుటుంబానికి నేస్తం ట్రస్ట్



అండగా ఉంటుందని తెలిపి రూ.8,000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అంకిరెడ్డి, గౌరవ సలహాదారులు సంకా సురేష్, సభ్యులు దుగ్గిరెడ్డి బాలనారాయణ రెడ్డి, సోము రఘునాథ రెడ్డి, జింకల రాంగోపాల్ రెడ్డి, కైపు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తెల్లబండ తండాలో గుడుంబాపై పోలీసుల దాడులు

### భారీగా నాటుసారాయి, పానకం స్వాధీనం.. ఆరుగురిపై కేసులు నమోదు

**హైదరాబాద్ పల్స్, మే 25, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలంలోని తెల్లబండ తండాలో అక్రమంగా నాటుసారాయి తయారీ జరుగుతోందన్న సమాచారంతో సోమవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి భారీ మొత్తంలో గుడుంబా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్న నాటుసారాయి తయారీపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ఈ దాడులు చేపట్టినట్లు సిఐ చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ చంద్రమౌళి మాట్లాడుతూ..ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు డోర్నకల్ ఎస్సైలు వంశీధర్, ఝాన్సీ తమ సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడి నుండి సుమారు ముప్పై లీటర్ల నాటుసారాయి, నాలుగు వందల యాభై లీటర్ల చక్కెర పానకం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సామగ్రి విలువ సుమారు అరవై వేల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. ఈ ఘటనలో బానోతు హమ్ము, జరుపుల బుజ్జి, జరుపుల భావు సింగ్, బానోతు కమల, బానోతు రవి, బోడ బుజ్జి అనే ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామానికి చెందిన ఇద్దరు పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్న చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. అలాగే నాటుసారాయి నమూనాలను రసాయన పరీక్షల కోసం సేకరించి సంబంధిత శాఖకు పంపించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ



మద్యం తయారీని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# బక్రీద్‌పై ఉక్కుపాదం.! రోడ్లపై నమాజ్, జంతు బలులు నిషిద్ధం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, ఉత్తరప్రదేశ్:**
ఉత్తర ప్రదేశ్‌లో పవిత్ర బక్రీద్ (ఈద్ అల్-అధా) పండుగ వేడుకల నిర్వహణపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సర్కారు అత్యంత కఠినమైన ఆంక్షలను విధించింది. పండుగ సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై నమాజ్ చేయడం గానీ, బహిరంగ ప్రదేశాలలో జంతు బలులు (ఖుర్బానీ) ఇవ్వడం గానీ అనుమతించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పండుగ సాంప్రదాయాలను చట్టబద్ధమైన పరిమితులకు లోబడే నిర్వహించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన ఉన్నత స్థాయి శాంతిభద్రతల సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జిల్లా పరిపాలనా విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నమాజ్ లేదా ప్రత్యేక ప్రార్థనలను కేవలం సాంప్రదాయ మసీదులు, ఈద్గాల ప్రాంగణాల లోపల మాత్రమే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి వల్ల కూడా సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకూడదని, రోడ్లను దిగ్బంధించి ప్రార్థనలు చేయడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. ప్రార్థనలు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉంటే, ఒకేసారి కాకుండా విడతలవారీగా (షిఫ్టుల పద్ధతిలో) ప్రార్థనలు ముగించుకోవాలని సీఎం సూచించారు.

**నిర్దేశిత ప్రాంతాల్లోనే 'ఖుర్బానీ'..**


బక్రీద్ పండుగలో అత్యంత కీలకమైన జంతు బలుల ప్రక్రియను కేవలం ముందుగా నిర్ణయించిన, సాంప్రదాయకంగా ఆమోదం పొందిన ప్రాంతాల్లో మాత్రమే నిర్వహించడానికి అనుమతి ఉంటుందని అధికారులు వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లోగానీ, ప్రజా రవాణా మార్గాల్లో గానీ జంతువులను వధించకూడదని సీఎం ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రమ వధశాలలపై నిఘా ఉంచాలని, లైసెన్స్ ఉన్న శాలలు కూడా తమ పరిమితికి మించి జంతువులను ఉంచకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పండుగ రోజుల్లో మాంసాన్ని బహిరంగంగా విక్రయించడాన్ని పూర్తిగా నిషేధించారు.

**వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అలర్ట్..**



జంతు బలుల అనంతరం మిగిలిపోయే వ్యర్థాలు, అవశేషాల వల్ల ప్రజారోగ్యానికి హాని కలగకుండా, మతపరమైన ఉద్రిక్తతలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని యోగి సర్కారు ఆదేశించింది. మున్సిపల్ కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు పారిశుధ్య నిర్వహణపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, వ్యర్థాలను వెంటనే తొలగించేలా శాస్త్రీయ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మళ్లీ భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు.!



**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25 :** దేశవ్యాప్తంగా మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్, ధరలు పెరిగాయి, ఇదిలా ఉండగా దేశంలో ఇంధన ధరలు పెరగ డం ఇది నాలుగో సారి.. తొలిసారి పెట్రోల్‌రూ.3 పెంచిన ప్రభుత్వం ఆ తర్వాత రూ..87 పైసలు పెంచింది, ఇవ్వాళ మరోసారి చమురు ధరలు పెంచింది, పెంచిన ధరల వివ రాల ప్రకారం లీటర్ పెట్రోల్ పై రూ.2.84 డీజిల్ పై రూ"2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి, పెంచిన ఈ ధరలు ఈరోజు ఉదయం 6 గంటల నుంచి అమ లులోకి వచ్చినట్లు తెలుస్తుంది.ఇప్పటికే మూడు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన విషయం పాఠకులకు తెలిసింది, సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావా న్ని చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నడుస్తున్న యుద్ధ వాతావరణం కారణం గా ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20% చమురు రవాణా జరిగే స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మార్గం గుండా రవాణా నిలిచిపోవడంతో చమురు సరఫరా ఆగిపోయింది.దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు భారీగా పెరిగాయి. బ్యారెల్ ధర వి100 మార్కును దాటిపోవ డంతో భారత్‌లో ఇంధన ధరలను పెంచక తప్పలేదు. అయితే అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు గత కొన్ని వారాలుగా సామాన్యులపై భారం పడకుండా ధరలను స్థిరంగా ఉంచాయి. దీనివల్ల ఆ కంపెనీలు దాదాపు రూ.1000 కోట్ల భారం పడుతుం దని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఈ నష్టాలను భర్తీ చేసుకు నేందుకే మళ్ళీ ధరల ను పెంచుతున్నట్టు కేంద్రం పేర్కొంది.

# భారత్ సృష్టించిన అతి పెద్ద 'అస్త్రం'.. చైనా, పాకిస్థాన్ లోని ప్రతి ఇంచు ఖతం..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25 :** ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రక్షణ వ్యవస్థల్లో భారత్ ఒకటి. శత్రుదేశాల నుంచి వచ్చే ముప్పును తిప్పి కొట్టేందుకు, దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించేందుకు డీఆర్డీఓ, భారత సైన్యం సంయుక్తంగా భూమి, ఆకాశం, సముద్ర మార్గాల ద్వారా దాడి చేయగల అత్యాధునిక క్షిపణులు, ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేశాయి. ప్రస్తుతం భారత క్షిపణి సామర్థ్యం ప్రపంచ దేశాలను సైతం ఆశ్చర్య పరుస్తోంది.అగ్ని సిరీస్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, పృథ్వీ, ప్రళయ్ లాంటి అల్ప శ్రేణి క్షిపణులు అలాగే బ్రహ్మోస్, నిర్భయ్ లాంటి క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. వీటితోపాటు ఎస్- 400 ట్రయంఫ్, ఆకాశ్,ఎంఆర్ సామ్(బరాక్ 8) రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇక భారత్ తన రక్షణ విధానంలో నో ఫస్ట్ యూజ్ విధానాన్ని పాటిస్తోంది. అంటే భారత్.. ఏ దేశం పైనా మొదటగా అణుదాడి చేయదు.. కానీ మనదేశంపై దాడి చేస్తే మాత్రం శత్రు దేశం ధ్వంసం అయ్యేంత రేంజ్ లో ఆయుధ సంపత్తిని భారత్ సిద్ధం చేసుకుంది. గతేడాది పాకిస్థాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భారత్ క్షిపణులు, రక్షణ వ్యవస్థలు పాకిస్థాన్ పై విరుచుకుపడిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ ప్రయోగించిన చైనా, టర్కీకు చెందిన డ్రోన్లు, ఆయుధాలను భారత్ ఇట్టే భూస్థాపితం చేసింది.అయితే తాజాగా భారత్ అమ్ముల పొదిలో మరో శక్తివంతమైన క్షిపణి చేరనుంది. అదే అగ్ని-6.. ఈ క్షిపణి ధ్వని వేగం కంటే దాదాపు 24 రెట్లు ఎక్కువ వేగంతో అంటే గంటకు 29,000 కిలోమీటర్లతో దూసుకెళ్తుంది. ఇంతటి హైపర్ సోనిక్ వేగంతో వచ్చే క్షిపణిని అడ్డుకోవడం ఏ శత్రు దేశ రక్షణ వ్యవస్థకైనా దాదాపు అసాధ్యం అనే చెప్పాలి. ఇక అగ్ని-6 క్షిపణి పరిధి దాదాపు 8 వేల నుంచి 12,000 కిలోమీటర్లుగా ఉంటుంది. అంటే ఇది కేవలం ఆసియా ఖండాన్నే కాకుండా.. మొత్తం యూరోప్ ఖండాన్ని కూడా తాకగలదని అర్థం.ఇక ఇందులో ఎంఐఆర్ వీ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దాంతో ఒకే ఒక్క అగ్ని-6 క్షిపణి ద్వారా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 10 విభిన్న లక్ష్యాలపై అణుబాంబులతో దాడి చేసే సామర్థ్యం ఉంది. అలాగే అగ్ని-6 కు వేగంగా వెళ్లగలిగే సామర్థ్యం మాత్రమే కాకుండా ఇందులో ఎంఏఆర్ వీ టెక్నాలజీ కూడా ఉంది. అంటే గాల్లో ప్రయాణించేటప్పుడు శత్రువుల రాడార్లు లేదా యాంటీ-మిసైల్ సిస్టమ్స్ దీనిని టార్గెట్ చేస్తే.. ఇది తన ప్రయాణ మార్గాన్ని స్వయంగా మార్చుకుని లక్ష్యాన్ని కచ్చితత్వంతో ధ్వంసం చేయగలదు. ఈ మేరకు డీఆర్డీఓ ఈ క్షిపణికి సంబంధించిన సాంకేతిక పనులన్నింటినీ పూర్తి చేసింది. అయితే అగ్ని-6 మిసైల్ పై చైనా, పాకిస్థాన్ ఆందోళన చెందుతున్నాయి. ఈ క్షిపణి పరిధి చైనా, పాకిస్థాన్ లోని ప్రతి సెంటిమీటర్ భూ భాగాన్ని కవర్ చేస్తుంది. కాబట్టి ఈ రెండు దేశాల వ్యూహాత్మక స్థావరాలకు ఇది పెద్ద ముప్పుగా మారింది.

# అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్ కొర్ర శాంతి విష్ణు నాయక్

## ప్రారంభోత్సవం చేసిన ఉప సర్పంచ్ స్వప్న రామదాస్ నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 25, షాద్నగర్ :** కొత్తూరు మండలం కోడిచర్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల కాచిగూడ తండాలో ఎంజీఎన్ఆర్ఇజిఎస్ నిధులనుండి 12 లక్షల నిధులతో చిన్నారుల సంక్షేమం మరియు మహిళల అభివృద్ధికి కీలకంగా నిలిచే అంగన్‌వాడీ కేంద్రానికీ నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోడిచర్ల తండా సర్పంచ్ శాంతి విష్ణు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ పంచాయతీ డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్ మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో గ్రామ పంచాయతీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యా అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు [illegible] కొనసాగుతున్నాయని వార్డు ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా నిర్వహించెందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంతో స్థానిక మహిళలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బిచ్య నాయక్, సంతోష్ నాయక్, వినోద్ నాయక్, భాస్కర్ నాయక్, రమేష్ నాయక్, శాంతి నాయక్, మాజీ ఎంపీటీసీ కిషన్ నాయక్, శాంతి శ్రీను నాయక్, గోపాల్ నాయక్, కిమ్లా నాయక్, భవాని, మంజుల మేడం, రవినాయక్, నాయకులు, వార్డు ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మరణించిన న్యాయవాది కుటుంబ సభ్యులకు భద్రత కల్పించాలి

## ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ పై పథకం ప్రకారం కారుతో దాడి చేసి హత్య చేసిన దుండగులతో పాటు వారి వెనుక ఉన్న రాజకీయ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌కు ముందునుంచే బెదిరింపులు, దాడులు జరుగుతున్నప్పటికీ పోలీసులు సరైన భద్రత కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన న్యాయవాది కుటుంబ సభ్యులకు తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ న్యాయవాదులపై దాడులు కొనసాగుతున్నాయని, ఇవి రోజు రోజుకూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యక్తులను హత్య చేస్తే న్యాయం ఆగిపోదని, న్యాయవాదులపై దాడి చేసే సంస్కృతికి ముగింపు పలకాలని ఆయన అన్నారు. బాధిత కుటుంబానికి ఐలు తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యాదాసు యాదయ్య, ఐలు జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య, గడ్డం నర్సయ్య, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి::** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మహిళా వారోత్సవాల సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, మహిళా సంఘాల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణలో మహిళలకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను ?5 లక్షల నుండి ?10 లక్షలకు పెంచి ?60,471 కోట్లు అందించనున్నట్లు వెల్లడించారు. వడ్డీ లేని రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాలకు ?1,390 కోట్లు అందించి వ్యాపార అభివృద్ధికి దోహదపడతామని తెలిపారు.భవిష్యత్తులో మహిళా సంఘాలకు రైస్ మిల్లుల స్థాపన, నిర్వహణలో ప్రోత్సాహం అందిస్తామని, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను నామమాత్రపు అద్దెకు కేటాయిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హరిత, వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ నిరసన

**సామాన్యుడి నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలు పెంచుతోంది.**

**డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై అదనపు భారం మోపడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా ఇంధన ధరల పెంపుతో రవాణా ఛార్జీలు, సరుకు రవాణా ఖర్చులు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేస్తూ సాధారణ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. వెంటనే పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మృతదేహాన్ని పరిశీలించిన ఆత్రం సుగుణక్క



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పులికుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జాడి బాబురావు మృతి చెందడం పట్ల డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి చేరుకున్న సుగుణక్క మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషాద ఘటన ఎంతో బాధాకరమని పేర్కొంటూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది సమాజానికి అందిస్తున్న సేవలు మరువలేనివని సుగుణక్క పేర్కొన్నారు. సుగుణక్క వెంట మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షుడు తరిఖ్, న్యాయవాది శ్యామ్ కుమార్,తదితరులు ఉన్నారు.

# వేధింపులు భరించలేక యువతి బలవన్మరణం

**కురవిలో కలకలం రేపిన ఘటన.. భర్త అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**

**హైదరాబాద్ పల్స్, మే 25, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో జరిగిన ఓ విషాద సంఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. భార్యను వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన ఆరోపణలపై భర్తను కురవి పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కురవి గ్రామ చెంచు కాలనీకి చెందిన గుజ్జుల మధు (21), తన భార్య గుజ్జుల రమణ (20)ను కొంతకాలంగా మానసికంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ దంపతుల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రమణ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మే 14న కేసు నమోదు చేసిన కురవి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సేకరించిన ఆధారాలు, వాంగ్మూలాల ఆధారంగా నిందితుడు గుజ్జుల మధును సోమవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గ్రామంలో విషాద ఛాయలు నింపింది. మహిళలపై వేధింపుల ఘటనల్లో కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కేసు దర్యాప్తును కురవి ఎస్సై బి. సతీష్ పర్యవేక్షిస్తున్నారు.

# మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో ప్రభుత్వం 10 లక్షల వ్యయంతో మంజూరు చేసిన మహిళా సహకార సంఘం భవనాన్ని ఆదివారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో అల్లం ఇన్నారెడ్డి, గ్రామ సర్పంచ్ జెన్నపల్లి బాలరాజు రెడ్డి, ఉప సర్పంచ్ రెడ్డబోయిన కవిత, వార్డు మెంబర్లు మహిళా సంఘాలు గ్రామ పెద్దలు మండల పార్టీ అధ్యక్షులు వివిధ రాజకీయ ప్రముఖులు, మండల పరిషత్ అధికారులు మండల రెవెన్యూ కార్యాలయ అధికారులు గ్రామ సెక్రెటరీ, గ్రామ ప్రజలు పాల్గొని శంకుస్థాపన నిర్వహించారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసువాలి

**సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజపేట మండలం చల్లూరు గ్రామంలో టీబీ వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంను గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... టీబీ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్ లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఇలాంటి కార్యక్రమం వలన అందరికీ వైద్యం అందుతుందని పేర్కొన్నారు. బిపి, షుగర్, క్యాన్సర్, టీబీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా 136 మందికి టీబి స్క్రీనింగ్ చేశారు అందులో 96 మందికి ఛాతి ఎక్సరే తీశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఎక్స్టెంషన్ ఆఫీసర్ భీకు నాయక్, సూపర్ వైజర్ ప్రేమలత , మానస హెల్త్ అసిస్టెంట్ మాధవి జిల్లా టీబి సూపెర్వైసోర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్సరే టెక్నీషియన్ ఉమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం పై అవగాహన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం నమిల గ్రామంలోని 1వ అంగన్వాడి కేంద్రంలో సోమవారం పోషకాహార పై అవగాహన కల్పించి వంట చేసారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పులి రాజు, అంగన్వాడి టీచర్ గిరెడ్డి పద్మ, ఆశాలు, ఏఎన్ఎం లు, గర్భిణీ బాలాంతలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

## భారత్ కు రష్యా మరో భారీ సాయం..

# పాకిస్థాన్, చైనాకు బ్యాడ్ న్యూస్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25 :** భారత్ కు చిరకాల మిత్రదేశం రష్యా.. భారత్– రష్యా మధ్య సత్సంబంధాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా.. అమెరికా, చైనా లాంటి అగ్ర దేశాలు హెచ్చరించినా భారత్ మాత్రం రష్యా చేతిని అసలు విడిచిపెట్టలేదు. అలాగే భారత్ కు అతిపెద్ద రక్షణ భాగస్వామిగా రష్యా ఉంది. మన సైన్యంలో ఉన్న మెజారిటీ ఆయుధాలు, యుద్ధ విమానాలు రష్యా టెక్నాలజీతో కూడినవే.. బ్రహ్మోస్ క్షిపణి, ఎస్–400 వైమానిక రక్షణ వ్యవస్థల్ని భారత్.. రష్యా నుంచి కొనుగోలు చేసింది. అలాగే కేవలం ఆయుధాలతోనే పరిమితం కాకుండా భారత్ లోనే ఏకే– 203 రైఫిళ్లు, సుఖోయ్ యుద్ధ విమానాల తయారీ వంటి మేక్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్ లోనూ రష్యా భారత్ కు సహకారం అందిస్తోంది.అలాగే రష్యా నుంచి భారత్ బారీ స్థాయిలో ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ కు ముడి చమురు సరఫరా చేసే దేశాల్లో రష్యా అగ్రస్థానంలో ఉంది. ఇదే కాక తమిళనాడులోని కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం రష్యా సాంకేతిక సహకారంతోనే నిర్మించారు. అయితే తాజాగా మరో రంగంలోనూ భారత్ కు రష్యా సహకారం అందిస్తోంది. ప్రస్తుతం భారత్ లో బుల్లెట్ ట్రైన్స్, మెట్రోలు, హైవేలు, డిఫెన్స్ కారిడార్లు, స్మార్ట్ సిటీల నిర్మాణం కారణంగా ఉక్కు డిమాండ్ భారీగా పెరిగిపోయింది.2030 నాటికి దేశీయ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 220 మిలియన్ టన్నుల నుంచి 300 మిలియన్ టన్నులకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఉక్కు పరిశ్రమకు అత్యంత కీలకమైన కోకింగ్ బొగ్గు సరఫరాలో రష్యా భారత్ కు అండగా నిలవనుంది. ప్రస్తుతం భారత్ కోకింగ్ బొగ్గు కోసం ఎక్కువగా ఆస్ట్రేలియాపై ఆధారపడుతోంది. అయితే ఇప్పుడు రష్యా ప్రత్యామ్నాయంగా మారనుంది.మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఉక్కు మార్కెట్, లోహాల ప్రాసెసింగ్, కీలక ఖనిజాల సరఫరా గొలుసుపై చైనాకు భారీ ఆధిపత్యం ఉంది. ఇప్పుడు ఈ రంగంలో భారత్– రష్యాల మధ్య బంధం బలపడితే చైనాపై ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాక గ్లోబల్ మార్కెట్ లో చైనా ఆధిపత్యాన్ని తగ్గించినట్టుగా అవుతుంది. ఇది చైనాకు గట్టి ఎదురు దెబ్బగానే భావించాలి. ఇక యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లు, డిఫెన్స్ ఎక్విప్ మెంట్లు, హై– స్పీడ్ రైల్వేల్లో వాడే ప్రత్యేకమైన ఉక్కు తయారీలో రష్యాతో భారత్ భాగస్వామ్యం కానుంది. భారత్ అనేక రంగాల్లో రాణిస్తుండటం అటు పాకిస్థాన్ కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని

# భర్తను హత్య చేసిన భార్య - ముగ్గురు నిందితులు అరెస్ట్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పరిధిలో సంచలనం సృష్టించిన ముత్యం రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. గంగాపూర్ గ్రామానికి చెందిన బోర్ మోటార్ మెకానిక్ శంబనోల్లా ముత్యం రెడ్డి ఈ నెల 16వ తేదీ నుంచి కనిపించకుండా పోవడంతో, అతని భార్య శంబనోల్లా కల్పన 18వ తేదీన నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో కల్పన ప్రవర్తనపై అనుమానం రావడంతో లోతుగా ఆరా తీయగా, ఆమెకు మానూర్ మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన గైని పండరితో అక్రమ సంబంధం ఉన్నట్లు బయటపడింది. పోలీసులు గైని పండరిని అదుపులోకి తీసుకుని విచారించగా, కల్పన, పండరి మరియు అతని అన్న గైని విట్టల్ కలిసి ముత్యం రెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. గత కొంతకాలంగా కల్పన, పండరి మధ్య సన్నిహిత సంబంధం కొనసాగుతుండగా, ఈ విషయం తెలుసుకున్న ముత్యం రెడ్డి భార్యను పలుమార్లు మందలించేవాడు. దీంతో తన అక్రమ సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని భావించిన కల్పన, ప్రియుడు పండరితో కలిసి హత్యకు పథకం రచించింది.ఈ నెల 16న ముత్యం రెడ్డిని బోర్ మోటార్ స్టార్టర్ రిపేర్ పని ఉందని నమ్మించి పండరి తన పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ముందుగానే సిద్ధంగా ఉన్న గైని విట్టల్‌తో కలిసి తాడుతో మెడ బిగించి హత్య చేశారు. అనంతరం ముందే జేసీబీతో తవ్విన గుంతలో మృతదేహాన్ని పడేసి మట్టితో పూడ్చిపెట్టారు. కేసును ఛేదించిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు నారాయణఖేడ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎస్సై శ్రీశైలం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అడుగులు

**బసంతపురం సర్పంచి మెండు రత్నమాల స్పష్టం**

**తల్లి కోసం సోంత గ్రామం కోసం తనయుని నిరంతర తల్లి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఊరు చిన్నదైనా ఉపాయం పెద్దది అన్నట్లుగా దేశంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నట్లు రాజపేట మండలం బసంతాపురం గ్రామ సర్పంచి మెండు రత్నమాల సత్తిరెడ్డి స్పష్టం చేశారు. అందుకోసం గెలిచిన మొదటి రోజు నుండి గ్రామంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు అడుగులు వేస్తూనే ఉన్నారు. ఉప సర్పంచి, మిగతా ఐదుగురు వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఇతర పార్టీల నాయకులతో కలిసి గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ల సహకారంతో ప్రత్యేక నిధులు మంజూరితోపాటు, పనులను చేపట్టారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రియ శిష్యుడిగా కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న మెండు భాస్కర్ రెడ్డి తన తల్లి మెండు రత్నమాలను భారీ మెజారిటీతో గెలిపించుకుని గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నాడు. ఎం బి ఆర్ ఫౌండేషన్ ద్వారా మూడుసార్లు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలను గ్రామంలో ఏర్పాటు చేశారు. అంతే కాకుండా గ్రామ ప్రజలకు ఉచిత మంచి నీటి ఏర్పాటు కోసం ఎంబియర్ ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసారు. దీంతో గ్రామ ప్రజలకు ఉచిత మంచి నీటిని మెండు భాస్కర్ రెడ్డి అందజేస్తున్నారు. తన తల్లి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ బాధ్యతలను భుజాలపై వేసుకొన్న మెండు భాస్కర్ రెడ్డి సిసి రోడ్ల ఏర్పాటు, ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు, రేషన్ షాప్ సబ్ సెంటర్, మహిళా సంఘ భవనం మంజూరు, రైతులకు ప్రత్యేకంగా 33 కెవి లైన్ ఏర్పాటు, ఇండ్ల మధ్య వున్న కరెంట్ లైన్ సరి చేయడం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో మంజూరీ చేసుకున్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమం నిర్వహించడం, తాగు నీరు, వీధి దీపాల ఏర్పాటు, ప్రతి సోమ, గురు వారాల్లో చెత్త తొలగింపు కొనసాగుతుంది. కుల సంఘాలకు సేవా సహకారం అందించడం, అంతేకాకుండా పెళ్లి అయిన వారికీ నగదు అందజేత, యువతకు ప్రోత్సాహం ఇస్తూ ప్రతి సంక్రాంతి పండుగ సమయంలో కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించి ఐదు వేల రూపాయల నగదు బహుమతి అందజేయడంతో పాటు యువకుల పుట్టినరోజు సమయంలో వారికి గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పే కొత్త సాంప్రదాయాన్ని మెండు రత్నమాల ఆధ్వర్యంలో భాస్కర్ రెడ్డి నిర్వహిస్తున్నారు. మృతి చెందిన పేద కుటుంబాలకు సహకారం అందజేస్తున్నారు.





## అన్నవరం సత్యనారాయణ స్వామి వారిని

# దర్శించుకున్న బీర్ల ఐలయ్య - అనిత దంపతులు

**శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల దంపతులు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య – శ్రీమతి బీర్ల అనిత తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు. అలాగే తమ 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ బీర్ల ఐలయ్య – అనిత దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతామని తెలిపారు.

# రసాయన శాస్త్రంలో రమేష్ గౌర కు పీ.హెచ్.డీ పట్టా

**ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల తయారీ....**

**సమర్థవంతమైన, సురక్షితమైన ఆర్థికంగా లాభదాయకమైన సంశ్లేషణ మార్గాల అభివృద్ధి....**

**ఔషధ పదార్థాల వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన గౌర బక్కయ్య కమల దంపతుల కుమారుడు, హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి రమేష్ గౌర డాక్టరేట్ (పీ.హెచ్.డీ.) పట్టాకు అర్హత సాధించారు. 'మెథిమజోల్, లెవోడోపా, మిటాపివాట్ సల్ఫేట్, వారెనిక్లిన్ టార్ట్రేట్ వంటి క్రియాశీల ఔషధ పదార్థాల వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి' అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగ ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమేష్ గౌర చేసిన పరిశోధన, ముఖ్యమైన ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల తయారీలో సమర్థవంతమైన, సురక్షితమైన ఆర్థికంగా లాభదాయకమైన సంశ్లేషణ మార్గాల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయన నాలుగు కీలక క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) కోసం నూతన, విస్తరించదగిన ప్రక్రియలను అభివృద్ధి చేసి, దిగుబడి పెంపు, మలినాల నియంత్రణ, ప్రక్రియ భద్రత, పారిశ్రామిక సాధ్యతను గణనీయంగా మెరుగుపరిచినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా, మెథిమజోల్ కోసం క్వాలిటీ బై డిజైన్ ఆధారిత పటిష్ట ప్రక్రియ, లెవోడోపా కోసం సరళీకృత రెండు దశల సంశ్లేషణ, మిటాపివాట్ సల్ఫేట్ కోసం ఆప్టిమైజ్ చేసిన బహుళ దశల మార్గం, అలాగే వారెనిక్లిన్ టార్ట్రేట్ కోసం నైట్రోసమైన్ రహిత మార్గాన్ని అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. అధునాతన విశ్లేషణ పద్ధతుల మద్దతుతో ఆయన చేసిన ఈ పరిశోధన, ఔషధ తయారీ రంగానికి ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తూ, ప్రాసెస్ కెమిస్ట్రీలో కీలక పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. డాక్టర్ రమేష్ గౌర పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం తదితరులు అభినందనలు తెలిపారు. సొంత మండలం రాజాపేట స్వగ్రామం పారుపల్లి లో ప్రజలు కుటుంబ సభ్యులు బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. రాజాపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. రమేష్ గౌర తో పారుపల్లి గ్రామానికే కాకుండా రాజపేట మండలానికి, యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు రాష్ట్రంలో, దేశంలో వచ్చిందని అన్నారు.

### ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ

# సంఘాల గ్రామ కార్యవర్గ సమావేశం...



- **ఆలేరు మండలం గొలనుకొండ గ్రామ ఎంఆర్పిఎస్, ఎంఎస్పి గ్రామశాఖ నూతన కమిటీలు ఎన్నిక....**
- **విద్యా, గ్రామీణ స్థాయి నిర్మాణం,జెండా ఆవిష్కరణలకు సిద్ధం...**
- **జులై 07 న ఎంఆర్పిఎస్32 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి....**
- **నల్ల చంద్ర స్వామి మాదిగ ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు, ఆలేరు మండల ఇంచార్జి**
- **కందుల నర్సింగ్ రావు మాదిగ,ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు ఆలేరు మండల కో- ఇంచార్జీ**







**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలో మాతమ్మ దేవాలయ ఆవరణలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేడు ఎం.ఆర్ పి.ఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల గ్రామ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం ఎం.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు భైరపాక బెంజిమెన్ మాదిగ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా ఎస్ఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఆలేరు మండల ఇంచార్జ్ నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు ఆలేరు మండల కో ఇంచార్జ్ కందుల నర్సింగ్ రావు మాదిగ లు హాజరై మాట్లాడుతూ...31 సంవత్సరాల పాటు ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణ కొరకు పోరాడి సాధించుకోవడం జరిగింది ఇప్పుడు అట్టి ఫలాలను ప్రస్తుతం సెలవుల సందర్భంగా గ్రామాలలో ఉన్న ప్రతి విద్యార్థి చదువుకొని వర్గీకరణ ఫలాలు పొందే విధంగా గ్రామాలకు తరలివెళ్లి చైతన్య పరచాలని మరియు జూలై 7న జరగబోయే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామ గ్రామన మాదిగల ఆత్మగౌరవ పతాక ఎం.ఆర్.పి.ఎస్ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గొలనుకొండ గ్రామ ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి గ్రామ శాఖలు ఎన్నుకోవడం జరిగింది.

**గొలనుకొండ నూతన ఎం ఆర్ పి ఎస్ గ్రామ శాఖ**

అధ్యక్షులు తాంద్ర సుధాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి భైరపాక సందీప్ మాదిగ అధికార ప్రతినిధి గందమళ్ళ ప్రసాద్ మాదిగ, ఉపాధ్యక్షులు మారుపల్లి రజనికాంత్ మాదిగ,కార్యదర్శి భువనగిరి అయోధ్య మాదిగ, సహాయ కార్యదర్శి భైరపాక ప్రకాష్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా ఎరుకల భాస్కర్ మాదిగ, మారుపల్లి శ్రీకాంత్ మాదిగ, భైరపాక గణేష్ మాదిగ, చిట్యాల హరి మాదిగ సలహాదారులు గా ఎరుకల అశోక్ మాదిగ, గుఱ్ఱం రాంచందర్ మాదిగ లు ఎన్నికయ్యారు.

**గొలనుకొండ ఎం.ఎస్.పి గ్రామ శాఖ నూతన కమిటీ**

అధ్యక్షులు బాకీ రాములు మాదిగ, ప్రధాన కార్యదర్శి చందేపల్లి ఆనంద్ మాదిగ, ఉపాధ్యక్షులు సుంచు అలెగ్జాండర్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా ముస్త్యాల మల్లయ్య మాదిగ, కాంద్రు ప్రభాకర్ మాదిగ, చందేపల్లి అశోక్ మాదిగ, మారుపల్లి పాండు మాదిగ, మారుపల్లి ప్రవీన్ మాదిగ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఆలేరు మండల ఇంచార్జ్ నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు ఆలేరు మండల కో-ఇంచార్జ్ కందుల నర్సింగ్ రావు మాదిగ, సీనియర్ ఎమ్మార్పియస్ నాయకులు భైరపాక బెంజిమెన్ మాదిగ, బాకీ రాములు మాదిగ, చందేపల్లి ఆనంద్ మాదిగ, సుంచు అలెగ్జాండర్ మాదిగ, ముస్త్యాల మల్లయ్య మాదిగ, కాంద్రు ప్రభాకర్ మాదిగ, చందేపల్లి అశోక్ మాదిగ, మారుపల్లి పాండు మాదిగ, మారుపల్లి ప్రవీన్ మాదిగ, తాంద్ర సుధాకర్ మాదిగ, భైరపాక సందీప్ మాదిగ, గందమళ్ళ ప్రసాద్ మాదిగ, మారుపల్లి రజనికాంత్ మాదిగ, భువనగిరి అయోధ్య మాదిగ, భైరపాక ప్రకాష్ మాదిగ,ఎరుకల భాస్కర్ మాదిగ, మారుపల్లి శ్రీకాంత్ మాదిగ, భైరపాక గణేష్ మాదిగ, చిట్యాల హరి మాదిగ, సలహాదారులు గా ఎరుకల అశోక్ మాదిగ, గుఱ్ఱం రాంచందర్ మాదిగ లు ఎన్నికయ్యారు.

### ప్రొఫెసర్ నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే

# చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

హైదరాబాద్, మే 25) : ఏపీ ప్రభుత్వం ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను హైదరాబాద్‌లోనే అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని.. అదే జరిగితే ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ్యాసన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను జనేసన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసుల పేరుతో వేధిస్తున్నాయని సోమవారం ఎక్స్'వేదికగా ఆమె మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్‌పై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలు చేస్తున్నారన్నారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు గౌరవించే మేధావిపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదుచేసి వేధింపులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాగా, వడదెబ్బ మృతుడి కుటుంబానికి భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ వాహనం ఇవ్వకపోవటంతో... కిలోమీటర్‌కు పైగా మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన ఘటనపై కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఉదంతంతో రేవంత్‌రెడ్డిది అమానవీయ ప్రభుత్వమని, పేదలపట్ల ఎంత నిర్దయగా ఉందో అర్థమవుతోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



## ఎమ్మెల్యే బీర్ల సహకారంతో పైప్ లైన్ పనులు ప్రారంభం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం నర్సాపురం గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో నూతనంగా గ్రామపంచాయతీ పైపులైను పనులను సోమవారం ప్రారంభించారు. పాత దుర్గమ్మ గుడి నుండి కొత్త దుర్గమ్మ గుడి వరకు, డంపింగ్ యార్డ్ నుండి పెద్దమ్మ గుడి వరకు పైపులైను పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎమ్మా శిరీష నాగరాజ్, గ్రామ కార్యదర్శి దండే లక్ష్మణ్, ఉప సర్పంచ్ నారపాక కరుణాకర్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు. నర్సాపురం గ్రామానికి ప్రత్యేక సహకారం చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి నర్సాపురం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పవర్ లూమ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి...

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం**






**హైదరాబాద్ పల్స్ న్యూస్ మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో పవర్ లూమ్ కార్మికులు ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు సోమవారం రోజు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం మాట్లాడుతూ... నిత్యావసర సరుకులు రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు చేస్తున్న పనికి ప్రతిఫలం మాత్రం శూన్యంగా మారిందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి దరలు పెంచాల్సిన యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఒక టనుకు 200 రూపాయలు పెంచాల్సి ఉండగా కేవలం 150 రూపాయలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఐదు రోజులుగా రఘునాథపురం గ్రామంలో సమ్మె జరుగుతున్న యాజమాన్యాలు స్పష్టత ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ లూమ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పవర్ లూమ్ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రదేశంలో వంట వార్పు ఏర్పాటు చేసుకున్నారు. యాజమాన్యాలు కటినంగా కాకుండా మానవత దృక్పథంతో ఆలోచించి కార్మికులకు న్యాయం చెయలని ప్రజాప్రతినిధులు ప్రజాసంఘాల నాయకులు కార్మికుల కుటుంబాలు కోరుతున్నారు.

## గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి : ఎసీడీపీవో సమీరా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 25, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య సూచనలు పాటించాలని రామన్నపేట ఎసీడీపీవో సమీరా సూచించారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మహిళా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో సమీరా మాట్లాడుతూ... తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు న్యూట్రిషన్ పై అవగాహన కల్పించారు. అనంతరం తల్లుల కోసం ఫుడ్ పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్య కార్యకర్తలు మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎం లు సాదియా, మంజుల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.




Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.